# ఆదిలాబాద్-మంచిర్యాల



# సూర్య

www.suryaaa.com

◆ నిర్మల్ ◆ కొమురంభీం ఆసిఫాబాద్



బుధవారం 12
జూన్ 2024 , పేజీలు 04

## లక్కీడ్రా పద్ధతిన బెస్ట్ అవైలబుల్ పాఠశాలల విద్యార్థుల ఎంపిక





**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్**

మంచిర్యాల ప్రతనిధి,జూన్ 11, సూర్య మేజర్న్యూస్ :

2024-25 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాలకు అర్హత గల షెడ్యూల్డ్ కులముల విద్యార్థినీ, విద్యార్థులను లక్కీడ్రా పద్ధతిన ఎంపిక చేయడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్రెడ్డితో కలిసి అభ్యర్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడ్రా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో 1, 5 తరగతులలో ప్రవేశం కొరకు విద్యార్థినీ, విద్యార్థులకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. 1వ తరగతిలో ప్రవేశం కొరకు 154 మంది విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా లక్కీడ్రా పద్ధతిన సజావుగా 92 మందిని ఎంపిక చేయడం జరిగిందని, ఇందులో బాలికల విభాగంలో 30 మంది బాలికలు, జనరల్ విభాగంలో 61 మంది బాలబాలికలు, అనాథ విభాగంలో 1 ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. 5వ తరగతిలో 160 మంది దరఖాస్తు చేసుకోగా 91 మందిని ఎంపిక చేయడం జరిగిందని, ఇందులో బాలికల విభాగంలో 29 మంది, జనరల్ విభాగంలో 61 మంది, అనాథ విభాగంలో 1 ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశానికి ఎంపికైన విద్యార్థినీ, విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని, ఉన్నత స్థానాలలో నిలిచేలా క్రమశిక్షణ, ఏకాగ్రతతో చదువుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం. రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల మరమ్మతుల పనులు సత్వరమే పూర్తి చేయాలి





**- జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ**


**ఆసిఫాబాద్ ప్రతినిధి 11 జూన్ సూర్య మేజర్ న్యూస్**

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ అన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలం, అడ గ్రామపంచాయతీ పరిధిలో గల వాడిగూడ ప్రాథమిక పాఠశాల, ఈదులవాడ ప్రాథమిక పాఠశాల, వాంకిడి మండలం లోని ఘాట్ జంగాం, మండోకర్ వాడ, గోయగాం పాఠశాలల్లో అమ్మ ఆదర్శపాఠశాల క్రింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు పాలనాధికారి మాట్లాడుతూ నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతుండటంతో పాఠశాలల్లో మిగిలివున్న మరమ్మతుల పనులను వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలల్లో తాగునీటి వసతి, విద్యుత్ సరఫరా, టాయిలెట్లు, శానిటేషన్, ఫ్యాన్ల ఏర్పాటువంటి పనులు సత్వరమే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాలల గదులు శుభ్రపరచాలని, ఆవరణలో ఉన్న చెత్తను, శిథిలాలను తొలగించాలని తెలిపారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునేలా చూడాలన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండటంతో విద్యార్థులకు అవసరమైన సమరూప దుస్తులు, పుస్తకాలు వెంటనే వారికి అందించే దిశగా కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓపిడి చార్జీలను కోలిండియ మాదిరిగా సింగరేణిలోను అమలు పరచాలి

### సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు

**మందమర్రి టౌన్, జూన్ 11, సూర్య మేజర్ న్యూస్**



బొగ్గు గని కార్మికులకు, అధికారులకు సింగరేణి యాజమాన్యం చెల్లించే ఓపిడి ఫీజు రీయంబర్స్ మెంట్ మొత్తాన్ని గతంలో ఉన్న 350 రూపాయల నుండి 1200 రూపాయలకు పెంచి, కోలిండియాలో అమలు చేస్తున్నారని, దానిని సింగరేణిలో సైతం అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వేజ్ బోర్డ్ సభ్యుడు మంద నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవరించిన ఓపిడి చార్జీలను సిపిఆర్ఎంఎస్ కార్డు ఉన్నవారికి సైతం వర్తించేలా ఒప్పందం చేసుకొని, కోలిండియా దాని అనుబంధ సంస్థలోని అన్ని సంస్థలలో చెల్లిస్తున్నందున సింగరేణిలో కూడ కోలిండియాలో చెల్లిస్తున్న ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కోలిండియాలో సిపిఆర్ఎంఎస్ కార్డు ఉన్న దంపతులకు ఒక్కొక్కరికి 25వేల రూపాయల మెడికల్ రీయంబర్స్మెంట్ కు ఒప్పందం చేసుకున్నామని ప్రచారం చేసుకొని సింగరేణిలో జరిగిన సిపిఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డులో గెలిచిన సంఘాలకు అవకాశం ఇవ్వడం వల్ల ఆ సంఘాలు యాజమాన్యానికి అనుకూలంగా ఉండి, ఆ ఒప్పందం అమలుకు యాజమాన్యాన్ని ఒప్పించ లేకపోయాయని ఆరోపించారు. సింగరేణిలోని సిపిఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డులో అన్ని యూనియన్లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలోనూ కార్మికుల దంపతులకు ఒక్కొక్కరికి 25 వేల రూపాయల మెడికల్ రీయింబర్స్మెంట్ చెల్లించి, పదవి విరమణ పొందిన కార్మికులకు తగిన న్యాయం చేయాలని నరసింహారావు డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**నిర్మల్ జూన్ 11, సూర్య మేజర్ న్యూస్**

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ముందుకెళ్లాలని జిల్లా విద్యాధికారి రవీందర్ రెడ్డి అన్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో మస్కాపూర్ ఉన్నత పాఠశాల ప్రగతి పత్రాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నాయని గుర్తు చేశారు. ప్రధానోపాధ్యాయులు నరేందర్ రెడ్డి, వెంకటరమణ, నరేందర్, శంకర్, శేఖర్, రమేశ్, అంజన్న ఉన్నారు.



## జేఈఈ ర్యాంకర్కు ఆర్థిక సాయం అందజేత



**వాంకిడి, జూన్ 11.సూర్య మేజర్ న్యూస్.**

ఇటీవల వెలుపడిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో 1782 వ ర్యాంకు సాధించి ప్రతిభ చాటిన దుర్గం అర్జున్ కు లక్ష్మణ్ సేవా సదన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.5100 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ను శాలువతో సన్మానించి అభినందించారు. అనంతరం సొసైటీ చైర్మన్ గాదె అవినాష్ మాట్లాడుతు ఇటీవల తండ్రి మరణించినా అధైర్య పడకుండా పట్టుదలతో చదివి జాతీయ స్థాయితో మంచి ర్యాంకు సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. పై చదువుల్లోనో ఇదే పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. పుట్టిన గ్రామానికి, కుటుంబ సబ్యులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. నిరుపేద కుటుంబానికి చెందిన అర్జున్ పైచదువులకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఆర్గనైజర్ గాదె అనిల్ కుమార్ ఉపాద్యాక్షుడు, బిఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహెూల్కర్, ప్రధాన కార్యదర్శి మడావి దౌలత్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రోషన్, నాయకులు అరుణ్, ఇంద్రజిత్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారికి ఆర్థిక సాయం

## అందజేసి మానవత్వం చాటారు

**ఇంద్రవెల్లి, జూన్11, సూర్య మేజర్ న్యూస్ :**

తల్లిదండ్రులను కోల్పోయి అనాథైన చిన్నారి (భాను) ను అభిమన్యు గ్రూప్ అడ్మిన్ పెందుర్ దీపక్,మెస్రం శేఖర్ ఆదివాసి నాయకులు మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని డొంగర్ గావ్ గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి ఆనక సంతోష్(,26) స్వప్న (24) యువ దంపతులు మృతిచెందారు.వారికి ఒక కుమార్తె భాను( 2) ఉంది. భార్య భర్తలు మృతి చెందడంతో అ పాప అనాథ లయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మెస్రం శేఖర్ ఆపాప భవిష్యత్తు కోసం అండండ ఉండాలన్న మానవ దృక్పథంతో ఆలోచించి ముందుగా వాట్సప్ అభిమన్యు గ్రూప్ లో తోచినంత సహాయం చేయాలని కోరగా దీనికి స్పందించి కులమత బేధం లేకుండా మానవ దృక్పథంతో ముందుకు వచ్చి ఎవరికి తోచిన సహాయాన్ని అందించి మానత్వం చాటుకున్నారు.మొత్తం దాతల విరాళాలు 127261రూపాయలు జమ కాగా ఇందులో పాప పోషణ కోసం 12000 అందించగా మిగితది 115261 రూపాయలను ఫిక్సెడ్ డిపాజిట్ చేసేందుకు నిర్ణయించాడం జరిగిందని తెలిపారు.ఆదివాసి నాయకులు ఆనక సంతోష్ స్వప్నలను నివాలర్పించి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా మెస్రం శేఖర్ మాట్లాడుతూ ఇంత చిన్నతనంలో మరణించడం చాలా బాధాకరం దురదృష్టకరమన్నారు. పాప భవిష్యత్తు కొరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. భవిష్యత్తులో పాపకి ఈ ఆపద వచ్చిన అండంగా ఉంటామన్నారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మెస్రం వెంకట్రావు, ఉర్వేత రుప్ దేవ్, తోడశం న గోరావ్,మెస్రం లింగు,మెస్రం నాగ్ నాథ్, పేందుర్ బాదు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్. బి.హేచ్. వి పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

### - ఐక్య విద్యార్థి సంఘాలు

**మంచిర్యాల టౌన్, జూన్ 11,సూర్య మేజర్ న్యూస్ :**

మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో గల ఆర్. బి.హేచ్. వి పాఠశాల పై చర్యలు తీసుకొని, గుర్తింపు రద్దు చేయాలని మండల విద్యాశాఖ అధికారి పోశయ్య కి ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఐక్య విద్యాసంఘాల నాయకులు మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలోని ఐబి చౌరస్తాలలోగల ఆర్. బి.హేచ్. వి పాఠశాల ప్రభుత్వ నిబంధనలకు



విరుద్ధంగా నడిపిస్తూ విద్యార్థులు అడ్మిషన్ల విషయంలో ముందస్తు ఎంట్రస్ టెస్టును పెట్టి వారి మార్కులను బట్టి విద్యార్థులను అడ్మిషన్లు చేస్తున్నారని, అదేవిధంగా పాఠశాలలో ప్రభుత్వ నిబంధన విరుద్ధంగా యూనిఫామ్,బుక్స్,సామాన్లు అమ్మి పాఠశాలను సూపర్ మార్కెట్ల తయారు చేస్తున్నారని,విద్యార్థులకు వాయిదాలకు మాయమాటలు చెప్పి వారి వద్ద నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని,ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నటువంటి ఆర్. బి.హేచ్. వి పాఠశాలపై చర్యలు తీసుకొని గుర్తింపు రద్దు చేయాలని ఎం ఈ ఓకి వినతిపత్రం ఇచ్చామని ఐక్య విద్యార్థుల నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలోచిప్పకుర్తి శ్రీనివాస్ టివియువి రాష్ట్ర కార్యదర్శి,జూమ్మిడీ గోపాల్ ఎన్ఎస్ఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,చేరాల వంశీ జెవిఎస్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,తదితరులు పాల్గొన్నారు.

## ఈదురు గాలికి కూలిన ఇళ్లు



**ఖానాపూర్,జూన్ 11, సూర్య మేజర్ న్యూస్ :**

ఖానాపూర్ మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో మంగళవారం ఈదురు గాలులతో కూడిన గాలివాన బీభత్సానికి గోదురి నరేష్ కి చెందిన ఇంటిపై నున్న ఇంటి రేకులకప్పు దూలలతో సహా ఎగిరిపోయాయి. రేకులు మళ్ళీ ఉపయోగపడనంతంగా పూర్తిగా ధ్వంసం అయ్యాయి అని బాధితుడు నరేష్ తెలిపారు. ఆ సమయంలో ఇంట్లో వున్న వారిపై గోడలోని ఇటుకలు పడి కుటుంబానికి గాయాలు అయ్యాయి అని బాధితుడు తెలిపారు .దీంతో ఆ కుటుంబం ఇళ్లు లేక నిరాశ్రయులు అయ్యారు. వర్షానికి ఇంట్లోని విలువైన పత్రాలు ,టీవీ,ఎలక్ట్రానిక్ వస్తువులు ,ఫ్యాన్లు,ధాన్యాలు తడిసి పాడయిపోయాయి అని అన్నారు . ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆ కుటుంబ సభ్యులు కోరుతున్నారు.



## 93 శాతం ప్రజల తరపున చిహ్నాలుండాలి



**లక్ష్మణ చాంద, జూన్ 11,సూర్య మేజర్ న్యూస్,**

తెలంగాణ రాష్ట్రంలోని 93 శాతం బీసీ ఎస్సీ ఎస్టీలు స్ఫూర్తి పొందేలా ప్రభుత్వ చిహ్నం ఉండాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్ అన్నారు. మంగళవారం లక్ష్మణచందా మండల కేంద్రంలోని తహాసిల్దార్ జానకికి మెమోరండం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతు ప్రపంచ ఖ్యాతిని పొందిన ఉస్మానియా యూనివర్సిటీ, భారత రాజ్యాంగ నిర్మాత డా.అంబేద్కర్, అగ్రకుల భూస్వామ్య వర్ణ వ్యవస్థ పై తిరగబడి బీసీ ఎస్సీ ఎస్టీల హక్కుల కోసం పోరాటం చేసిన పండుగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న,సమ్మక్క సారలక్కల చిత్రపటాలతో కూడిన ధర్మసమాజ్ పార్టీ ఈ ప్రభుత్వ చిహ్నాన్ని ఆమోదించాలని పేర్కొన్నారు. వేల సంవత్సరాలుగా బీసీ ఎస్సీ ఎస్టీలకు ఎటువంటి స్ఫూర్తిదాయక చిహ్నాలు లేవని, 93 శాతం ఉన్న వీరికి చరిత్రలో మహనీయుల స్ఫూర్తిని నింపాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ సభ్యులు సొన్న భూమేష్ మహారాజ్, కల్లూరు సుధాకర్ రాజు మహారాజ్, కూనింటి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ పట్టణ అభివృద్ధికి సహకరించాలి

### - మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం

**ఖానాపూర్,జూన్11, సూర్య మేజర్ న్యూస్ :**



ఖానాపూర్ పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణంలో జరుగుతున్న, జరగబోయే అభివృద్ధి పనుల పైన మరియు వార్డులలో ఉన్న పలు సమస్యలపైన మున్సిపల్ కౌన్సిల్ సర్వ సభ్య సమావేశం నిర్వహించామని అన్నారు. వచ్చే వర్ష కాలాన్ని దృష్టిలో వుంచు కుని అన్ని వార్డుల్లో తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. పట్టణ అభివృద్ధికి కౌన్సిలర్లు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ కారింగుల సంకీర్తన సుమన్ , జన్నరపు విజయలక్ష్మి శంకర్ , నాయిని స్రవంతి సంతోష్ , పరిమి లత సురేష్ ,అఫ్రీన్ అమనుల్లా ఖాన్ , కిషోర్ నాయక్ , అబ్దుల్ ఖలీల్ ,కుర్మా శ్రీనివాస్ ,పౌజియ షబ్బీర్ పాష , కో ఆప్షన్ సభ్యులు బండారి కిషోర్ , మాలన్ బేగం ,మున్సిపల్ కమిషనర్ మనోహర్ , మున్సిపల్ ఏఈ తిరుపతి , మున్సిపల్ మేనేజర్ సురేందర్ , మున్సిపల్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ ఫిరోజ్, మున్సిపాలిటీ అధికారులు సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంకొనుగోలు

**నిర్మల్ జూన్ 11, సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లాలోని 19 మండలాల్లో 228 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1.58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. 13,921 మంది రైతుల నుంచి 313.78 కోట్ల విలువైన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయగా రైతుల ఖాతాలో ఇప్పటివరకు రూ.271 కోట్ల నగదును జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు.త్వరలో పూర్తిస్థాయిలో నగదును రైతుల ఖాతాలో జమ చేయనున్నారు.



## తెలంగాణ రాజ ముద్రలో అంబేద్కర్ చిహ్నం ఉండాలి



**బోథ్ టౌన్, జూన్ 11,సూర్య మేజర్ న్యూస్**

ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహరాజ్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ బోథ్ మండల కేంద్రంలో మంగళవారం తహసీల్దార్ కి తెలంగాణా ప్రభుత్వం తయారు చేస్తున్న ప్రభుత్వం నూతనంగా తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతమున్న తెలంగాణా చిహ్నాన్ని మారుస్తున్న సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ ఆ నూతన చిహ్నంలో కింది మార్పులు చేయాలని వినతి పత్రం అందించడం జరిగింది.ఈ సందర్భంగా ధర్మ సమాజ్ పార్టీ బోథ్ మండల కన్వీనర్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన ఉస్మానియా యూనివర్సిటీని, దాని నుండి గౌరవ డాక్టరేట్ తీసుకున్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ని ఈ చిహ్నంలో ఉంచాలని.అగ్రవర్ణ భూస్వాముల పై అణగారిన వర్గాల రాజ్యం కోసం హక్కుల కోసం యుద్ధం చేసిన పండగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్,సమ్మక్క సారక్కల చిత్రాలను కూడా ఉంచాలని తెలంగాణ ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నానని అన్నారు.ఈ కార్యక్రమంలో బోథ్ మండలం ధర్మ సమాజ్ పార్టీ మండల నాయకులు రమేష్, గణేష్, పాలేపు గంగయ్య పోనకంటి జైపాల్ , శివ,అఖిల్, విజయ్, వాఘ్మరే అశోక్‌లు పాల్గొన్నారు.

## ఒక లక్ష 65 వేల గంజాయి పట్టివేత



**నేరడిగొండ, జూన్ 11, సూర్య మేజర్ న్యూస్**

గంజాయి తరలిస్తుండగా స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఎస్ ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రోల్ మమద టోల్ ప్లాజా వద్ద మంగళవారం రోజున విశ్వసనీయత సమాచారం ప్రకారం పోలీసులు తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ చెందిన పపిశెట్టి సంతోష్ కుమార్ అనే వ్యక్తి వద్ద ఆరున్నర కిలోల గంజాయి లభించింది.వారిని అదుపులోకి తీసుకుని గంజాయి ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ ఐ తెలిపారు.ఇట్టి గంజాయిని ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని ధర్మ సాగర్ గ్రామానికి చెందిన సాబ్లే జైత్ రాం,అమర్ సింగ్ ల వద్ద నుంచి సేకరించినట్లు,ఇట్టి గంజాయి విలువ సుమారు రూ.1లక్ష 65 వేల విలువ చేసే గంజాయి పట్టుబడినట్లు తెలిపారు.బాధితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.నిషేధిత గంజాయి తరలిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవన్నారు.

### రామోజీరావు మృతి తెలుగు ప్రజలకు తీరని లోటు

**నిర్మల్ జూన్ 11, సూర్య మేజర్ న్యూస్**

ఈనాడు గ్రూప్ చైర్మన్ రామోజీ రావు మృతి తెలుగు ప్రజలకు తీరనిలోటు అని పలువురు వక్తలు అన్నారు.నిర్మల్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సంతాప సభ నిర్వహించారు.వ్యాపారవేత్తగా, ఈనాడు సంస్థ అధిపతిగా, రామోజీ ఫిల్మ్ సిటీ వ్యవస్థాపకుడిగా ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆయన మృతి తెలుగు ప్రజలకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక సభ్యులు పాల్గొన్నారు.



## ఐఎన్టియుసి బాయి బాట కార్యక్రమము

**శ్రీరాంపూర్, జూన్ 11, సూర్య మేజర్ న్యూస్:**

శ్రీరాంపూర్ ఏరియా ఆర్కె- 6 మైన్ లో ఐఎన్టియుసి యూనియన్ బాయి బాట కార్యక్రమము యూనియన్ ఏరియా బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికుల పిల్లలు ఎదురు చూస్తున్నా వయో పరిమితిని ప్రజా ప్రభుత్వమైన కాంగ్రెస్ సహకారంతో ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి జనక్ ప్రసాద్ పోరాట ఫలితంగా వయోపరిమితిని 35 నుండి 40 ఏళ్లకు పెంచి ఐఎన్టీయూసీ విజయం సాధించిందని అందుకు ఐఎన్టిసి శ్రీరాంపూర్ బ్రాంచ్



ఆధ్వర్యంలో ఆర్కె 6 మైన్ లో కార్మికులతో కలిసి టపాసులు పేల్చి స్వీట్లు పంచి విజయోత్సవ సంబరాలను జరుపుకోవడం జరిగిందని, యూనియన్ సెక్రటరీ జనరల్ బి జనక్ ప్రసాద్ శ్రీరాంపూర్ ఏరియా కార్మికుల అందరి తరపున అభినందనలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. మైన్ లో కార్మికులకు రెస్ట్ హాల్ క్యాంటీన్ లాకర్ సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచాలని రేకులు పగిలి వర్షం పడితే ఉరిసే విధంగా ఉన్న షెడ్లను వెంటనే మరమ్మతులు చేయాలని వివిధ సమస్యలను పరిష్కరించాలని ఆర్కె 6 గని మేనేజర్ రిప్రెంటేషన్ చేయడం జరిగగా మేనేజర్ స్పందించి వెంటనే ఆ సమస్యలను పరిష్కారం చేస్తామని వారు హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి కేంద్ర ఉపాధ్యక్షులు కలవెన శ్యామ్,కేంద్ర డిప్యూటీ సెక్రెటరీ గరిగే స్వామి, ఏరియా కార్యదర్శులు వి కుమారస్వామి,నాయకులు జీవన్ రెడ్డి మహేష్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో వెలగని విధి దీపాలు

**ఖానాపూర్ ,జూన్11,సూర్య మేజర్ న్యూస్ :**

ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో నీ విధుల్లో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. ఓ వైపు చిన్న పాటి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్డు పైకి పాములు, తేళ్ల వలన, అలాగే రోడ్డు సరిగా లేక వచ్చి వెళ్ళే వాహనాలకు కూడా వీధి దీపాలు లేక ఇబ్బంది ఏర్పడే అవకాశం వుంది అని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు . కావున మండలంలో ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు స్పందించి ఆయా గ్రామాల్లో విధి దీపాలు వెలగని ప్రదేశాల్లో విధి దీపాలు ఏర్పర్చాలి అని గ్రామస్తులు కోరుతున్నారు.

### మునిపెల్లి వయా చింతల్ చందా ఆర్టీసి సర్వీసు ప్రారంభం

**- ఫలించిన నాయకుల ప్రయత్నాలు**

**- సంతోషం వ్యక్తం చేసిన గ్రామస్తులు**

**లక్ష్మణ చాంద, జూన్ 11,సూర్య మేజర్ న్యూస్,**

నిర్మల్ టు చింతల్ చందా వయా మునిపెల్లి బస్ సర్వీసు మంగళవారం నుండి ప్రారంభం అయింది.ఇకపై ప్రతి రోజు ఉదయం 10. 30 గంటలకు ఒక ట్రిప్పు,సాయంత్రం 04. 00 గంటలకు ఒక ట్రిప్పు చొప్పున పై సర్వీస్ నిరంతరాయంగా కొనసాగనుంది.గత ఎన్నికల ప్రచారం సందర్భంగా మాకు ఆర్టిసి బస్ రాకపోవటం వలన చాల ఇబ్బందులు ఎదురవుతున్నాయని బస్ వచ్చేటట్లు చేస్తేనే ఓటేస్తాం లేకుంటే లేదు అని ప్రచారానికి వచ్చిన నాయకులకు తెగేసి చెప్పారు. ఈ సమస్య విన్న నాయకులు అయిండ్ల భూపాల్ రెడ్డి,అడ్వాలరమేశ్,సురకంటి ముత్యం రెడ్డి,కమల్ కోట వెంకట్ రెడ్డిలు ఆ సమయంలోనే డిఎం కార్యాలయానికి వెళ్లి పై ప్రజల సమస్యను వివరించి సర్వీసును వేయాల్సిందిగా కోరారు.ఎలక్షన్ల అనంతరం ఈ బస్ సర్వీసును వేస్తామని డిఎం ప్రతిమా రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నేడు ఈ బస్ సర్వీసు ప్రారంభమైనట్లు వారు తెలిపారు.ప్రతి నిత్యం అనేక ధృవపత్రాలకోసం మండల కేంద్రంలోని వివిధ కార్యాలయాలకు వెళ్ళాలన్నా,డ్వాక్రమహిళలు బ్యాంకుకు వెల్లాలన్నా అనేక ఇబ్బందులు ఎదుర్కున్నేవారు.ఈ సర్వీసు ప్రారంభం కావటం వలన స్థానికులంతా ఆ సమస్య తీరిందని సంతోషం వ్యక్తం చేశారు. అందుకు కృషి చేసిన నాయకులకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

### గ్రామ పంచాయతీ కార్మికుల

## పెండింగ్ వేతనాలు చాలించాలి



**జైనూర్ మే 11 సూర్య మేజర్ న్యూస్**

జైనూర్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కారోబార్లు కామటీలు డ్రైవర్లు మరియు గ్రామ పంచాయతీల కార్మికులు గత ఆరు నుండి ఏడు నెలలుగా వేతనాలు రాక ఏమి తోచని స్థితిలో ఉన్నారు.మంగళవారం జైనూర్ కేంద్రంలో అన్ని గ్రామ పంచాయతీల కార్మికులు సమావేశం ఏర్పాటు చేసి దళారుల నుండి డబ్బులు మిత్తికి తీసుకుందామని నిర్ణయం తీసుకున్నారు. సరైన సమయంలో మేము చేసే పనికి ఇంట్లో కుటుంబ ఫోషన రోజు రోజుకి భారంగా మారుతుందని, ఇప్పటికే ఒక్కో కార్మికుడు 50 వేల వరకు అప్పు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన వచ్చింది లేదు.ప్రభుత్వం అన్ని రకాలుగా గ్రామ పంచాయతీ కార్మికులను వాడుకొని వేతనాలు విషయంలో చిన్న చూపు చూస్తుందని ఆకలితో పని చేయిస్తుందని జైనూర్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్మికులు సమావేశం నిర్వహించడం జరిగింది.

### కోల్ ఇండియా మాదిరిగా ఓపిడి ఛార్జీలు చెల్లించాలి

**శ్రీరాంపూర్, జూన్ 11, సూర్య మేజర్ న్యూస్:**

సింగరేణిలో ఓపిడి చార్జీలు కోల్ ఇండియా మాదిరి చెల్లించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ నాయకులు వేజ్ బోర్డు మెంబర్ మంద. నరసింహా రావు ఒక ప్రకటనలో తెలిపారు.బొగ్గు గని కార్మికులకు, అధికారులకు సింగరేణి యాజమాన్యం చెల్లించే ఓపిడి ఫీజు రియంబర్స్మెంట్ మొత్తాన్ని గతంలో ఉన్న 350.00 రూపాయల నుండి 1200.00 రూపాయలకు పెంచుతూ కోల్ ఇండియాలో చెల్లిస్తున్నారని, సవరించిన చార్జీలను సిపిఆర్ఎంఎస్ కార్డు ఉన్న వారికి కూడా వర్తించేలా ఒప్పందం చేసుకుని కోల్ ఇండియా దాని అనుబంధ సంస్థల్లోని అన్ని సంస్థలలో చెల్లిస్తున్నందున సింగరేణిలోనూ కోల్ ఇండియా ప్రకారం చెల్లించాలని, కోల్ ఇండియాలో సిపిఆర్ఎంఎస్ కార్డు ఉన్న దంపతులకు ఒక్కొక్కరికి రూ.25000/- మెడికల్ రియంబర్స్మెంట్ ను అగ్రిమెంట్ చేసుకున్నామని ప్రచారం చేసుకుని సింగరేణిలో జరిగిన సిపిఆర్ఎంఎస్ ట్రస్ట్ బోర్డులో గెలిచిన సంఘాలకు అవకాశం ఇవ్వడం వల్ల యాజమాన్యానికి అనుకూలంగా ఉండి ఒప్పించలేకపోయినందున అన్ని యూనియన్లకు ట్రస్ట్ బోర్డులో అవకాశం కల్పించాలని, సింగరేణిలోను రు.25000 వేలు చెల్లించి మెడికల్ రియన్బర్స్మెంట్ రిటైర్డ్ కార్మికులకు న్యాయం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియుగా డిమాండ్ చేస్తున్నాము పేర్కొన్నారు.

### ఖిరిడిలో బడిబాట గ్రామ సభ

**వాంకిడి, జూన్ 11,సూర్య మేజర్ న్యూస్,**

మండలంలోని ఖిరిడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం బడిబాట గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధాయుడు సోయం ఇందురావు మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలని, అలాగే 3 నుంచి 4 ఏళ్ల పిల్లలను సైతం ప్రీ ప్రైమరి తరగతుల్లో చేర్పుకోవడం జరుగుతుందని అన్నారు. ఉచిత విద్యతో పాటు యూనిఫారమ్, భోజనం, పాఠ్య పుస్తకాలు, ఉచితం ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఐదుగురు ఉపాధ్యాయులతో నాణ్యతతో కూడిన విద్యనందిస్తున్న మా ప్రభుత్వ బడిలోనే తమ పిల్లలను చేర్పించాలని గ్రామస్తులను కోరారు. అనంతరం గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు విమలబాయి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల నమోదులో తమ వంతు కృషి చేస్తామని అన్నారు. తల్లిదండ్రులందరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జ్యోతి, ఉపాధ్యాయులు పవర్ శృతి, తిప్పారెడ్డి రాజు, మదావి గణపతి, తదితరులు పాల్గొన్నారు.



